లోక్ అదాలత్‌లో 273 కేసుల పరిష్కారం

కోహీర్, మార్చి16: జాతీయ లోక్ అదాలత్ ద్వారా 273కేసులను పరిష్కరించామని జహీరాబాద్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జీ సూరికృష్ణ వెల్లడించారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని సివిల్ కోర్టులో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ జహీరాబాద్ ఆధ్వర్యంలో జాతీయ లోక్ ఆదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు బ్యాంకులకు చెందిన 51కేసులు పరిష్కారమయ్యాయని బ్యాంకు పీఎల్సీల నుంచి రూ.63,24,319 లక్షలు వసూలు అయ్యాయని వెల్లడించారు. జూనియర్ కోర్టు విభాగంలో 222 కేసులను పరిష్కరించామన్నారు. ఆయా కేసుల నుంచి రూ.1,01,260లక్షలు వసూలు అయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి అనూష పాల్గొన్నారు.

కేసులను పరిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూలు విడుదల

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 16 : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం శనివారం షెడ్యూలు విడుదల చేసింది. జహీరాబాద్, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానాలకు మే 13న పోలింగ్ జరుగనున్నది. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్‌తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 18న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయబడుతుందని, అదే నెల 25న నామినేషన్లకు గడువు పూర్తి కానున్నదని, 26న నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగుస్తుందని వివరించారు. మే 13న పోలింగ్ నిర్వహించనుండగా, జూన్ 4న ఓట్ల లెక్కింపు, 6న ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూలు విడుదల చేసినందున మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి వచ్చిందన్నారు.

దీంతో జిల్లాలో ఎవరు కూడా రూ.50 వేల కంటే ఎక్కువ నగదును తీసుకెళ్లరాదని, పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో ఎక్కువ నగదు తీసుకెళ్తే అందుకు తగిన పత్రాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి

సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలి

న్యాల్‌కల్, మార్చి16: మండలంలోని గ్రామాల్లో తాగునీరు, కరెంట్ సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజాప్రతినిధులు కోరారు. శనివారం న్యాల్‌కల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని స్థానిక ఎంపీపీ అంజమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ గౌసొద్దీన్ మాట్లాడుతూ ప్రస్తుత వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని మండలంలోని గ్రామాల్లో తాగునీరు, కరెంట్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సంబంధిత శాఖాధికారులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో నుంచి వయా న్యాల్‌కల్, డప్పూర్ మీదుగా బీదర్‌కు బస్సులు నడపకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆయా గ్రామాల ప్రజలు మహాలక్ష్మి పథకం కింద బస్సులో ప్రయాణించేందుకు వీలుకలగడం లేదన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సాబేర్‌హుస్సేన్ మాట్లాడుతూ మండలంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్‌డీఎఫ్ పథకం కింద రూ. 21లక్షల నిధులు మంజూరి కోసం ప్రభుత్వానికి నివేదికలను పంపించమన్నారు. గృహలక్ష్మి పథకం కింద జీరో బిల్లులు రాని వినియోగదారులు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ అర్జున్ పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీపీ అంజమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీవో సురేశ్, ఏవో లావణ్య, పీఆర్, ఐబీ ఏఈలు కృష్ణజ్యోషి, రవీందర్, ఏపీఎం కుమార్, ఆర్‌ఐ దుర్గయ్య, ఎంపీటీసీలు , శ్రీనివాస్ రెడ్డి, శివనంద, సిద్ధమ్మ పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో సురేశ్

బొల్లారం విద్యార్థులకు ‘తానా’ ప్రశంసా పత్రాలు

బొల్లారం, మార్చి 16 : ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) 100దేశాల్లో ఉన్న 100 తెలుగు సంఘాల ఆధ్వర్యంలో ‘వందే విశ్వమాతరమ్’ పేరుతో గత డిసెంబర్ మాసంలో నిర్వహించారు.

‘పద్య కుసుమార్చన’ కార్యక్రమంలో భాగంగా బొల్లారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 20మంది విద్యార్థులు పాల్గొని ప్రశంసా పత్రాలు సాధించినట్లు తెలుగు గైడ్ ఉపాధ్యాయుడు అడ్డాడ శ్రీనివాసరావు తెలిపారు. చిగురుమళ్ల శ్రీనివాస్ రచించిన అమ్మ, నాన్న, గురువు అను శతకంలోని 20పద్యాలను విద్యార్థులు కంఠస్థం చేసి ఒకే రోజు ఒకే సమయంలో 10లక్షల మంది విద్యార్థులతో ప్రపంచ వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. కాగా వీరికి అంతర్జాతీయ సంస్థ తానా పంపిన ప్రశంసా పత్రాలను శుక్రవారం పాఠశాలలో అందజేశామన్నారు. విద్యారులను హెచ్‌ఎం మంగీలాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

తానా సంస్థ నుంచి అందుకున్న ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం,మార్చి16: ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ అన్నారు. శనివారం ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో రూ. 28లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు, హిందూ శ్మశానవాటికలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్సీపురం డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కాలనీల్లో పార్కులు, అంతర్గత డ్రైనేజీ పైపులైన్‌లు, సీసీ రోడ్లు, విద్యుత్ లైట్ల ఏర్పాటు ఇలా మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని చెప్పారు. డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంజయ్య, సుంకుస్వామి, రవి, మల్లేశ్, నర్సింహ, మాణయ్య, కృష్ణ, ప్రభు, శ్రీకాంత్, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అందోల్ : ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, పార్టీ శ్రేణులు

పటాన్‌చెరు : బీఆర్‌ఎస్ నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

సంగారెడ్డి : కేంద్రం, ఈడీలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే,నాయకులు

కవిత అరెస్ట్‌పై భగ్గుమన్న బీఆర్‌ఎస్

- అధికారంలో ఉంటే ప్రతిపక్షాల అరెస్టులా
- కేంద్రం తీరును తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు
- ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదు
- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రభాకర్
- బీజేపీలో చేరితే అన్ని కేసులు మాఫీ చేస్తారు
- ఆరోపించిన బీఆర్‌ఎస్ నాయకులు

జహీరాబాద్ జాతీయ రహదారిపై ధర్నా నిర్వహిస్తున్న మాణిక్‌రావు, గాలి అనిల్‌కుమార్, తన్వీర్

సంగారెడ్డి, మార్చి16 : బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం సిగ్గుచేటని సంగారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతాప్రభాకర్ అన్నారు. శనివారం పార్టీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ తీసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఈడీని అడ్డుపెట్టుకుని కవితను అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ జారీ కాగానే ఎమ్మెల్సీని కావాలనే ఈడీ అక్రమ అరెస్ట్ చేసిందన్నారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి కాంగ్రెస్ నాయకులు ప్రజలకు నమ్మకం కలిగించాలన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, నాయకులు నరహరిరెడ్డి, కాసాల బుచ్చిరెడ్డి, రాంరెడ్డి, ఆర్. వెంకటేశ్వర్లు, నర్సింహులు, బీరయ్య యాదవ్, డాక్టర్ శ్రీహరి, సుదర్శన్‌రెడ్డి, మాణిక్‌ప్రభు, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ అక్రమ అరెస్టులకు భయపడేది లేదు

అందోల్, మార్చి 16: బీజేపీ అక్రమ అరెస్టులకు, కక్ష సాధింపు చర్యలకు భయపడేది లేదని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టును నిరసిస్తూ శనివారం జోగిపేట హన్‌మాన్ చౌరస్తాలో నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపి ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవిత అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీజేపీ రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే కవితను అరెస్ట్ చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, ఎంపీపీ బాలయ్య, మాజీ ఎంపీపీ రామాగౌడ్, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కవిత అరెస్టుపై బీఆర్‌ఎస్ తీవ్రస్థాయి నిరసన

పటాన్‌చెరు, మార్చి 16: కవిత అరెస్టుపై బీఆర్‌ఎస్ శ్రేణులు నిరసన చేపట్టారు. పటాన్‌చెరు పట్టణంలో జాతీయ రహదారిపై బీఆర్‌ఎస్ శ్రేణుల రాస్తారోకో నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్టును వారు తీవ్రంగా ఖండించారు.

పటాన్‌చెరు ఎమ్మెల్యే సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి అక్రమ అరెస్టును ఖండిస్తూ కాంగ్రెస్ డౌన్‌డౌన్ నినాదాలు చేశారు. పటాన్‌చెరు పోలీసులు రంగప్రవేశం చేసి బలవంతంగా బీఆర్‌ఎస్ నేతలను పోలీస్‌స్టేషన్ తరలించారు. సొంత పూచీ కత్తుపై వారిని వదిలేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, అమీన్‌పూర్ ఎంపీపీ ఈర్ల దేవానంద్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కొలన్‌బాల్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రాంతీయ పార్టీలను అణచివేయాలనే ఆలోచనలతోనే జాతీయ పార్టీలు అక్రమ కేసులు పెడుతున్నాయన్నారు.

మోదీ ప్రభుత్వం ఎమ్మెల్సీ కవితపై అక్రమ కేసును పెట్టి ఈడీ ద్వారా అరెస్టులు చేయించడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో గుమ్మడిదల జడ్పీటీసీ కుమార్‌గౌడ్, కార్పొరేటర్ పుష్పానగేశ్, అమీన్‌పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నర్సింహగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, వెంకటేశంగౌడ్, అంజయ్యయాదవ్, పరమేశ్‌యాదవ్, షేక్‌హుస్సేన్, నాయికోటి రాజేశ్, పాండు, మహ్మద్ అఫ్జల్, శకీల్, బూన్ పాల్గొన్నారు.

అరెస్టు చేయడం అప్రజాస్వామ్యం

కోహీర్, మార్చి16: ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా శనివారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలోని 165వ జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరి మధ్య చిచ్చు పెడుతున్న బీజేపీ తీరుతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. జహీరాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ మాట్లాడుతూ బీజేపీకి ఓటమి భయం, రాజకీయ కుట్రలో భాగంగానే ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమాభివృద్ధి సంస్థల కార్పొరేషన్ మాజీ చైర్మన్ తన్వీర్ అహ్మద్ మాట్లాడుతూ సుప్రీంకోర్టులో కేసు ఉన్నప్పుడూ ఎలా అరెస్టు చేస్తారని మండిపడ్డారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, నర్సింహులు, శంకర్‌నాయక్, సుభాశ్‌రెడ్డి, బండిమోహన్, రవికిరణ్ ఉన్నారు.

అక్రమ అరెస్టులు సహించం..

నారాయణఖేడ్, మార్చి 16: కవిత అరెస్టుకు నిరసనగా బీఆర్‌ఎస్ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి నారాయణఖేడ్‌లో ర్యాలీ నిర్వహించి అనంతరం రాజీవ్‌చౌక్ వద్ద రాస్తారోకో చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం విచారణ సంస్థలను ప్రతిపక్ష నాయకులపై ఉసిగొల్పుతున్నదన్నారు. ఎమ్మెల్సీ కవితపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేసిన బీఆర్‌ఎస్ పార్టీని అప్రతిష్ట పాలు చేసే బీజేపీ ప్రయత్నాలను వచ్చే ఎంపీ ఎన్నికల్లో ప్రజలే తిప్పికొడతారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థికి సన్మానం

కోహీర్, మార్చి16: జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను శనివారం జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. జహీరాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా ఎంపికైన తర్వాత తొలిసారి జహీరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి విచ్చేసినందుకు ఆయనను సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, పరిశ్రమల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ తన్వీర్ అహ్మద్, తదితరులు ఉన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

మనూరు, మార్చి 16 : హనుమాన్ ఆలయంలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. హనుమాన్ మందిరంలో రైతు సమన్వయ సమితి కో–ఆర్డినేటర్ జనార్దన్‌రెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జైపాల్‌రెడ్డి, నర్సింహులు, రాజు పాల్గొన్నారు.

డీసీఎంఎస్‌తో రైతులకు మేలు

కోహీర్, మార్చి16: డీసీఎంఎస్ భవన సముదాయ భవనం అందుబాటులోకి రావడంతో రైతులకు ఎంతగానో మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. జహీరాబాద్ పట్టణంలో నూతనంగా నిర్మించిన డీసీఎంఎస్ భవన సముదాయాన్ని డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావును సన్మానించారు. కార్యక్రమంలో పరిశ్రమల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ తన్వీర్, నామ రవికిరణ్, డీసీఎంఎస్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి కల్యాణం

కోహీర్, మార్చి16: మండలంలోని రాచన్నస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శనివారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. అందంగా అలంకరించిన మండపంలో దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల మధ్య భద్రకాళీదేవి సమేత రాచన్నస్వామికి కల్యాణాన్ని చేపట్టారు.

వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే

రాచన్నస్వామి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఈవో శివరుద్రప్ప, శివానంద్, జగదీశ్వర్‌స్వామి, శివమూర్తిస్వామి, శ్రీపాల్, పాల్గొన్నారు.

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అక్రమ కేసులు, వేధింపులకు భయపడం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- మాదారంలో కూల్చివేసిన ఇండ్లు పరిశీలన

కూల్చివేసిన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

జిన్నారం, మార్చి 16: ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత కక్షలకు తావులేదని, కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మాదారం గ్రామంలో నిరుపేదలకు నిర్మించుకున్న ఇండ్లను కక్షగట్టి కూల్చివేయడం సరికాదన్నారు. రాజకీయాలు కేవలం ఎన్నికల సమయంలోనే చేయాలని హితవు పలికారు. మాదారం గ్రామంలో అక్రమంగా నిర్మించారని బీఆర్‌ఎస్ కార్యకర్తల ఇండ్లను శుక్రవారం కూల్చివేయడంపై బాధితులు, మండల బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. పార్టీలో చేరికల కోసం అక్రమ కేసులు బనాయించి, ఆస్తులను ధ్వంసం చేసి ఒత్తిళ్లకు గురి చేయడం కాంగ్రెస్ పార్టీకే చెల్లిందన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆధైర్యపడాల్సిన అవసరం లేదని, పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. నష్టపోయిన పార్టీ కార్యకర్తలకు వ్యక్తిగతంగా ఆర్థిక సాయం అందజేస్తానని వారికి ధైర్యం చెప్పారు.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు మారడం సహజమని, అధికారులు ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు వెంకటేశంగౌడ్, మాజీ సర్పంచ్‌లు సురేందర్‌గౌడ్, ఆంజనేయులు, శెట్టి శివరాజ్, జనార్దన్, ఖదీర్, సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్, నాయకులు వైప్రభాకర్‌రెడ్డి, మల్లేశ్, గణేశ్ పాల్గొన్నారు.

రాజీతో కేసుల పరిష్కారం

రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటీవ్ చైర్మన్ పి. శ్యామ్ కోషి


జాతీయ లోక్ అదాలత్‌లో బాధితులకు చెక్కులు, పత్రాలు అందజేసిన రాష్ట్ర లీగల్ సర్వీసెస్ ఆథారిటీ ఎగ్జిక్యూటీవ్ చైర్మన్ పి. శ్యామ్ కోషి

సంగారెడ్డి, మార్చి16 : కోర్టుల్లో కేసులు వేసి ఆర్థిక ఇబ్బందులకు గురయ్యే కక్షిదారులకు సత్వరన్యాయం అందించేందుకు జాతీయ లోక్ అదాలత్‌లు ఉపయోగపడుతాయని రాష్ట్ర లీగల్ సర్వీసెస్ ఆథారిటీ ఎగ్జిక్యూటీవ్ చైర్మన్ శ్యామ్ కోషి అన్నారు. శనివారం సంగారెడ్డిలోని జిల్లా కోర్టు ఆవరణలో లోక్ అదాలత్‌లను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర లీగల్ సర్వీసెస్ ఆథారిటీ ఎగ్జిక్యూటీవ్ చైర్మన్ పి. శ్యామ్‌కోషి హాజరయ్యారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు అధ్యక్షతన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హన్మంతరావు కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో సంగారెడ్డి–5, జహీరాబాద్–2, జోగిపేట్–1, నారాయణఖేడ్–1 కోర్టుల్లో 9లోక్ అదాలత్ బెంచిలు ఏర్పాటు చేశారు. కక్షిదారులు తమ న్యాయవాదులను కలిసి రాజీతో కేసులు పరిష్కరించుకోవడం సంతోషకరమన్నారు.

51,078 కేసుల పరిష్కారం

ఈ సందర్భంగా న్యాయమూర్తి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ సత్వర న్యాయానికి లోక్ ఆదాలత్‌లు ఎంతో ఉపయోగకరమని, న్యాయవాదుల సలహాలు పాటించి న్యాయం పొందాలన్నారు. ఈ లోక్ అదాలత్‌లలో 51,078 కేసుల పరిష్కారం చేసి బాధితులకు కోట్లల్లో పరిహారం అందించామన్నారు. ఇందులో మోటరు వాహన ప్రమాద నష్టపరిహారం–29కేసులు, క్రిమినల్ కాంఫౌండ్ కేసులు–16,206, సివిల్ తగాదాలు–28, బ్యాంక్ రికవరీ కేసులు–85, ఫ్రీ లిటిగేషన్ కేసులు–34,002, ఫ్రీ లిటిగేషన్ ఏపీటీఎస్ కేసులు–723, భూసేకరణ కేసులు–5లలో బాధితులకు పరిహారం ఇప్పించామన్నారు. న్యాయవాదులు సూచించిన విధంగా కేసులను రాజీ చేసుకుని ఆర్థిక ఇబ్బందులు, సమయం వృథాను అదా చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లలో అవార్డు అంతిమ తీర్పు అని అప్పీలు చేసుకునే అవకాశం ఉండదని న్యాయమూర్తి స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు, జిల్లా ప్రథమ అదనపు జడ్జి సుదర్శన్, రెండవ అదనపు జడ్జి కృష్ణార్జున, మూడవ అదనపు జిల్లా జడ్జి సునీత రవీంద్రరెడ్డి, నాల్గవ అదనపు జిల్లాం జడ్జి లావణ్య, జిల్లా న్యాయపేవాధికార సంస్థ కార్యదర్శి హన్మంతరావు, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారి, జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ జడ్జి తేజశ్రీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్పీ చెన్నూరి రూపేశ్, సీనియర్ న్యాయవాదులు, డీఆర్వో, పోలీసులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 439 కేసులు పరిష్కారం

అందోల్, మార్చి 16 : జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం జోగిపేట కోర్టులో నిర్వహించిన కార్యక్రమంలో 439కేసులు పరిష్కరించినట్లు జడ్జి ధనలక్ష్మి తెలిపారు. అందోల్, వట్‌పల్లి, అల్లాదుర్గం, టేక్మాల్, పుల్కల్ తదితర మండలాల్లోన్ని ఠాణాల పరిధిలో నమోదైన కేసుల్లో స్థానికంగా పరిష్కరించదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించినట్లు తెలిపారు.

చిన్న చిన్న విషయాలను కేసులను పెట్టుకుని కోర్టుల చుట్టు తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని కక్షి దారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ విషయంపై పోలీసులు, న్యాయవాదులు అవగాహన కల్పించాలన్నారు.

నిల్వ గంజాయి దహనం

సంగారెడ్డి, మార్చి16 : పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన గంజాయిని, జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లలో నిల్వ ఉంచిన గంజాయిని న్యాయమూర్తుల ఎదుట దహనం చేసేందుకు అనుమతి పొంది దహనం చేశామని ఎస్పీ రూపేశ్ తెలిపారు. శనివారం కోహిర్ మండలం పైడిగుమ్మల్ శివారులో నిబంధనలను పాటిస్తూ జిల్లా డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో కాల్చి వేశారు. ఈ సందర్భంగా జిల్లాలో పోలీసుల తనిఖీలలో పట్టుబడిన గంజాయిని న్యాయమూర్తిల సమక్షంలో ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కోర్టు అనుమతితో ఎఫ్‌ఎస్‌ఎల్ శాంపిల్ తీసి మిగిలిన మొత్తాన్ని దహనం చేశామన్నారు. ప్రభుత్వ నిషేధిత గంజాయి విలు వ దాదాపు రూ.5కోట్లు ఉంటుందని, 1982కిలోలల గంజాయిని కాల్చివేశామన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇకపై మత్తుకు బానిసలై గంజాయిలాంటి మత్తు పదార్థాలను సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని మరోసారి ఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో డ్రగ్ డిస్పోజల్ సభ్యులు అదనపు ఎస్పీ సంజీవరావు, డిఎస్పీ సత్తయ్యగౌడ్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌లు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిల్వ ఉన్న గంజాయిని గ్రామాలకు దూరంగా దహనం చేసిన పోలీసులు

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE AT : ZAHEERABAD
O.S.No. 228 of 2022

Between:-
Ibrahim and others. ...Plaintiffs.
AND
Md. Wajid Miya & another. ...Defendants.

To
To whomsoever it may concern.

Take notice that, the above said plaintiffs have filed the above suit for Declaration to declare them as legal heirs and Successors of Late Smt. Mahboob Bee, W/o. Late Moinuddin who died on Dated 10-05-2010 leaving behind the plaintiffs as her legal heirs and successors vide in O.S.No. 228 OF 2022 on the file of Hon'ble Junior Civil Judge Court at Zaheerabad and the same stands posted to 21-03-2024 for your appearance before the Hon'ble Junior Civil Judge at Zaheerabad, as such if anybody can have any objection or right please appear on the above said date at about 10-30 AM before the above said Court. In default of your appearance on that day the matter will be heard ex-parte and decided accordingly.

/ / BY ORDER OF THE COURT / /
Sd/- **(Mohd. Mahboob Ali), Advocate,** Sangareddy.